క్లుప్తంగా

అర్జీల పరిష్కారంపై దృష్టి



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం 12 వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు. పలు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల వాసులు విన్నవించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ అర్జీలపై తక్షణమే స్పందించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జోన్–8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు సమ్మెంగపాలెంలో గురుస్వామి ఓలిశెట్టి అప్పలరాజు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పల్లకీ ఉత్సవ ఊరేగింపును సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, గంగవరం పీఠం అయ్యప్ప స్వాములు, శరణుఘోష చెప్పుకొంటూ రంగులు జల్లుకొని పేటతుళ్లి ఆడారు. అనంతరం పీఠం గురుస్వామి అప్పలరాజును మిగిలిన స్వాములు ఘనంగా సత్కరించారు.

పీహెచ్‌సీ వైద్యాధికారి జయశ్రీ బాధ్యతల స్వీకరణ



పరవాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా ఆర్. జయశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేసిన ఐఆర్ రంజిత్ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి తన వంతు కృషి చేస్తానని పీహెచ్‌సీ వైద్యాధికారి జయశ్రీ చెప్పారు.

పినగాడిలో నేడు రీ సర్వే

పెందుర్తి: రీ సర్వేలో భాగంగా మంగళవారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 65,99 లలో సర్వే నిర్వహించనున్నట్లు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సబంధిత సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

చీరల అందజేత

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెం గ్రామానికి చెందిన శ్రీనూకాంబిక కోలాటం గ్రూపు సభ్యులకు ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, కుమారుడు నరేష్ తమ సొంత నిధులతో సమకూర్చిన చీరలు సోమవారం సభ్యులకు అందజేశారు.కార్యక్రమంలో ఎస్.జగదీశ్వరరావు, కె.నాగేష్, అలమండ రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పేదల సంజీవని



విశాలమైన వార్డులో ఏర్పాటు చేసిన పది పడకలు

నాడు పేద కుటుంబాల వారు జబ్బు బారిన పడితే అంతే సంగతులు.. నిరుపేదలు కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడమే శరణ్యం.

ఇక సామాన్య, మధ్య వారైతే జీవితాలు తాకట్టుపెట్టి అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడమే మార్గం. నేడు పరిస్థితి పూర్తిగా మారింది.

పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వాస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోంది.



రోగి నుంచి రక్త నమూనా సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్

- పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు
- ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- పురుషోత్తపురం అర్బన్‌హెల్త్ సెంటర్‌కు రోగుల తాకిడి



జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ఇదీ కదా అభివృద్ధి

పెందుర్తి: పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చారు. అవసరమైన వసతులతో పాటు వైద్యులు, సిబ్బంది, నాణ్యమైన మందులు సర్కారు ఆస్పత్రుల్లో అందుబాటులోకి తెచ్చారు. అది కూడా ప్రజలకు చేరువలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పొరేట్ స్థాయిలో హెల్త్ క్లినిక్‌లు నిర్మించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోంది. దీంతో తమకు భరోసా లభించిందని పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.21 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్

జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో రూ.1.21 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించారు. రక్త పరీక్షల నుంచి మందుల వరకూ ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుంది. రోజుకు సగటున 70 నుంచి 90 మంది వైద సేవలు పొందుతున్నారు.

కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా..

విశాలమైన ఓపీ హాల్, 10 ఆధునిక బెడ్‌లతో ఆహ్లాదకమైన వార్డు నిర్మించారు. రక్త, ఇతర పరీక్షల కోసం ఆధునిక వసతులతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. నిరంతర పర్యవేక్షణ చేసే వైద్యాధికారి, ఆరుగురు సిబ్బందిని నియమించారు.

అందించే సేవలు : శుక్రవారం గర్భిణుల కోసం గైనకాలజిస్ట్, చెవి, ముక్కు, గొంతు సమస్యల కోసం ఈఎన్‌టీ డాక్టర్ అందుబాటులో ఉంటారు. శనివారం ఎముకల, దంత వైద్యులు, గురువారం చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో ఉంటారు. అన్ని రకాల జ్వరాలకు, ఇతర సమస్యలకు ఇక్కడే రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల్లో జబ్బు పెద్దది అయితే ఆరోగ్యశ్రీ ద్వారా రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు.

పురుషోత్తపురం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

ప్రాంతం	: 95వ వార్డు, పురుషోత్తపురం
నిర్మాణ వ్యయం	: రూ.1.21 కోట్లు
వసతులు	: 04 గదులు 10 పడకలు
అత్యాధునిక సదుపాయాలతో ల్యాబ్ బయో కెమిస్ట్రీ యంత్రం	సీబీసీ, ఎలక్ట్రోలైట్
ఓపీ సమయం	: ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు
ఓపీ సంఖ్య	: రోజూ 70 – 90 మంది
ప్రధాన వైద్యాధికారి	: డాక్టర్ హనీష



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ హనీష



రోగికి ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్న నర్స్

వైద్య సేవలు చాలా బాగున్నాయి



గతంలో ప్రభుత్వాసుపత్రిలో వసతులు, వైద్యులు సరిగా లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఏదైనా ఆరోగ్య సమస్యతో ప్రైవేటు ఆస్పత్రికి వెళితే రూ.వేలల్లో ఖర్చు అయ్యేది. మా ఊళ్లోనే ఇంత పెద్ద ఆస్పత్రి ఏర్పాటు చేసి రూపాయి ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఏదైనా ఇబ్బంది అనుకుంటే ఇంకా మంచి ఆస్పత్రికి ఉచితంగా పంపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చాలా మంచిగా చేస్తున్నారు.

– టి.సీతమ్మ, మరిడిమాంబకాలనీ.

ఉచితంగా రక్త పరీక్షలు



ప్రైవేటు ఆస్పత్రికి వెళితే ఏ చిన్న అనుమానం ఉన్నా రక్త, ఇతర పరీక్షల కోసం రూ.వేలల్లో దండుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఏ ఇబ్బంది వచ్చినా ఇక్కడకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసుకుని తగిన మందులు ఉచితంగా తీసుకుంటున్నాం. వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వం వైద్యం చాలా బాగుంది.

–ఎం.రాజు, పాపయ్యరాజుపాలెం

నిరుపేదల కళ్లల్లో ఆనందం



ఇక్కడకు సగటున రోజుకు 70–80 మంది వైద్యం కోసం వస్తున్నారు. సకాలంలో వారికి తగిన వైద్యం చేసి పంపుతున్నాం. మరీ ఇబ్బందికరమైన పరిస్థితి అయితే రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నాం. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా సేవలు అందడంతో నిరుపేదలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంచి సేవలందించడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ హనీష, వైద్యాధికారి, ఇన్‌చార్జి

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



వివిధ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో అతిథులు

పెందుర్తి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. పెందుర్తి గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జోనల్ కమిషనర్ ఎం.ఎం నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రాలైన గ్రంథాలయాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, పైడిరాజు, మల్లేశ్వరరావు, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆదారి రామకృష్ణ పాల్గొన్నారు.



అడవివరం గ్రంథాలయంలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

బహుమతుల ప్రదానం

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో 56వ వార్షు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆఖరి రోజు సోమవారం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు, గ్రంథాలయ స్థలదాత దాసరి సన్యాసశెట్టి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చందన, అపర్ణ, మేఘాద్రిగెడ్డ గురుకుల కళాశాల గ్రంథాలయాధికారి మాధవీలత, రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

సబ్బవరం :గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎంపీపీ సూర్యకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు ప్రతి రోజూ సందర్శించాలని సూచించారు. గ్రంథాలయాధికారి శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు వై. రాము, పలువురు ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

అంగన్‌వాడీల ఆందోళన

సబ్బవరం: ఐసీడీఎస్కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో మాతృ మరణాలు తగ్గించడానికి కృషి చేస్తున్న అంగన్‌వాడీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పిల్లల అభివృద్ధి పథకానికి తగిన నిధులు కేటాయించడం లేదన్నారు. దీంతో పోషకాహార లోపం కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8 నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మె నోటీసును ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు వీవీ రమణమ్మ, ఎం. రమణి, బి. రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ ఏఈ శేషసాయి ఒక ప్రకటనలో తెలిపారు. జాజులవానిపాలెం, గౌతులచ్చన్న నగర్, పోర్ట్‌కో, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి

- 25న సబ్బవరంలో సామాజిక సాధికార యాత్ర
- విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెట్టాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఈ నెల 25న సబ్బవరం మండల కేంద్రంలో జరగనున్న సామాజిక సాధికారిక బస్సు యాత్ర పోస్టర్‌ను సోమవారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎస్సీలు, బీసీలు, మైనారిటీలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాల గురించి వివరించడానికే ఈ బస్సు యాత్ర చేపట్టామన్నారు. సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపిస్తున్న నాయకుడు వైఎస్ జగన్ అని చెప్పారు. సబ్బవరంలో జరగనున్న బస్సు యాత్ర, బహిరంగ సభతో ప్రతిపక్షాల వెన్నులో వణుకుపుట్టాలన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బల్ల రాంబాబు, వైఎస్సార్‌సీపీ వార్డుల అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, నాయకులు టి.వినోద్, దాసరి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై రెవెన్యూ కన్నెర్ర

పెందుర్తి: పలు ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కన్నెర్ర చేశారు. పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలోని సర్వే 100లో కంచెర్ల సూర్యప్రకాషరావు అనే వ్యక్తి ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గతంలోనే తహసీల్దార్ శ్యాంప్రసాద్ నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. అయితే రెవెన్యూ అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ అతడు అక్రమ నిర్మాణం చేపట్టాడు. దీంతో ఆ నిర్మాణాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు.

కోర్టును తప్పుదోవ పట్టించబోయి:

లక్ష్మీపురం సర్వే నెంబర్ 117/2లోని గెడ్డను ఆక్రమించి కొందరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. అయితే రెవెన్యూ అధికారులు రాకుండా ఉండేందుకు జిరాయితీ భూమి ఉన్న సర్వే నెంబర్ 105/2 పత్రాలు సృష్టించి హైకోర్టును ఆశ్రయించడంతో అక్రమదారులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే సర్వే నెంబర్ 105/2లో కాకుండా గెడ్డ అయిన సర్వే నెంబర్ 117/2లో నిర్మాణం చేపట్టారని తహసీల్దార్ శ్యామ్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. దీంతో సర్వే నెంబర్ 105/2 నిర్మాణాన్ని మాత్రమే తొలగించ వద్దని తీర్పు ఇవ్వడంతో సర్వే నెంబర్ 117/2 గెడ్డ స్థలంలోని నిర్మాణాన్ని సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వభూముల్లో అక్రమాలను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.



అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

హర హర మహాదేవ

కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. వేకువజామునే ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. హరనామస్మరణ మార్మోగింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

పరవాడ: మండలంలోని పరవాడ, భర్నికం, తాడి, నాయుడుపాలెం, దీపాంజలినగర్, లేమర్తి శివాలయాలు భక్తులతో సోమవారం కళకళలాడాయి. పరవాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీ మల్లికార్జున స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బందారు రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తాడిలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం భక్తులతో రద్దీగా మారింది. వాడచీపురుపల్లి పరిసర గ్రామాల భక్తులు దీపాంజలినగర్, నాయుడుపాలెం ప్రాంతాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఓం నమో శివ రుద్రాయ

పెందుర్తి: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా తొలి సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలకు భక్తులు బారులు తీరారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. వందలాది మంది భక్తులు మహాశివునికి పూజలు చేశారు.
- పినగాడి చోడేశ్వరస్వామి ఆలయంలో విశేష అభిషేకాలు జరిగాయి. అర్చనలు చేశారు.
- సరిపల్లిలోని శివాలయంలో భక్తులు స్వహస్తాలతో శివునికి క్షీరాభిషేకాలు చేశారు. మహానంది, ధ్వజస్తంభాలకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు.
- కృష్ణరాయపురంలోని శివాలయం, శ్రమశక్తినగర్ రామలింగస్వామి దేవాలయం, చింతలగ్రహారం శివాలయం, సుజాతనగర్‌లోని హరహరక్షేత్రం, పెందుర్తి మహాకామేశ్వరి అమ్మవారి ఆలయంలోని జ్యోతిర్లింగాల సన్నిధిలో ఘనంగా పూజలు చేశారు.



పెదయాతపాలెంలోని గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు



మల్లికార్జునస్వామిని దర్శించుకొన్న గ్రామ పెద్దలు



సింహగిరిపై స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



పరవాడ శివాలయంలో...

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రహ్లాదపురంలోని శివాలయంతో పాటు 98వవార్డులోని పాత అడవివరం, విజినిగిరిపాలెం, కాపుదిబ్బ, ప్రియాగార్డెన్స్, సింహపురికాలనీలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి.

సబ్బవరం: దేవీపురం శ్రీ రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి దేవస్థానంలోని దక్షవాటిలో, లింగాలతిరుగుడు, వంగలి సోమలింగేశ్వరస్వామి, పెదయాతపాలెం గౌరీ పరమేశ్వర్ల సహిత ద్వాదశ జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రం, ఇరువాడ భీమలింగేశ్వరస్వామి, సబ్బవరం, గొర్లివానిపాలెంలోని ఉమారామలింగేశ్వర స్వామి, గణపతిపురం మల్లికార్జునస్వామి శైవ క్షేత్రాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. పెట్రోకారిడార్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి తదితరులు పెదయాతపాలెంలోని గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతీ గడపకు జగన్ అండ..



ఎస్ఆర్ పురంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ దేవి, సర్పంచ్ శ్రీను



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

పెందుర్తి: ప్రతీ గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని..రానున్న ఎన్నికల్లో ప్రతీ ఇంటిపై వైఎస్సార్‌సీపీ జెండాఎగురవేయాలని ఎంపీపీ మధుపాడ నాగమణి అన్నారు. మండలంలోని సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్‌పురం) పంచాయతీలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆమె వెల్లడించారు. జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, పార్టీ నేత మధుపాడ అంజి పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి

సబ్బవరం: అభివృద్ధి,సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని మల్లునాయుడుపాలెం సచివాలయం పరిధిలో సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో అందించిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలను వివరించే బోర్డును ఆమె విష్కరించారు.

కార్యక్రమంలో సర్పంచ్ బోను దేముడమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి కనకరాజు, బోకం రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.